క్లుప్తంగా

శ్రీరామేశ్వరస్వామికి జలాభిషేకం

బనగానపల్లెరూరల్: మండలంలోని పలుకూరు గ్రామంలో వెలసిన శ్రీరామేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు భాస్కరయ్య ఆధ్వర్యంలో గురువారం స్వామివారికి జలాభిషేకం నిర్వహించారు. చిన్నారులు సమీపానున్న బావి నీటిని 108 మట్టి కుండల్లో మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయం చేరుకున్నారు. అనంతరం స్వామి వారికి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు మాట్లాడుతూ ప్రతి ఏడాది మాసశివరాత్రి రోజు స్వామివారికి జలాభిషేకం చేయడం ద్వారా సర్వవ్యాధి ఉపశమనం, దర్భిక్ష నివారణ, సంతానవృద్ధి, గ్రామాభివృద్ధి జరుగుతుందన్న శాస్త్రం పేర్కొంటున్నట్లు తెలిపారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

కొలిమిగుండ్ల: రైతులు పండ్ల తోటలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ఏపీఓ గంగన్న గురువారం తెలిపారు. మండలంలో 250 ఎకరాల్లో పండ్ల తోటల సాగు చేసేలా ఉన్నతాధికారులు టార్గెట్ విధించారన్నారు. ఐదు ఎకరాల్లోపు చిన్న, సన్న కారు రైతులు చీని, నిమ్మ, మామిడి, జామ, సపోటా, కొబ్బరి, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్స్ తదితర పంటలు సాగు చేసేందుకు సబ్సిడీ సౌకర్యం కల్పిస్తుందన్నారు. బోరు బావులు ఉన్న రైతులు ఉద్యాన పంటల సాగు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం మూడేళ్ల వరకు మొక్కల నిర్వహణ కోసం రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుందన్నారు. ఆసక్తిగల రైతులు వివరాల కోసం ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఫోర్‌లైన్స్ నిర్మాణ పనుల పరిశీలన

బనగానపల్లెరూరల్: పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి జీఎం టాకీస్ వరకు సుమారు రూ.8 కోట్లతో శరగవేగంగా జరుగుతున్న ఫోర్‌లైన్స్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సోదరుడు కాటసాని తిరుపాల్‌రెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి కృష్ణతో కలిసి గురువారం పరిశీలించారు. జీఎం టాకీస్ నుంచి పంచాయతీ రాజ్ కార్యాలయం వరకు ఉన్న మంచినీటి సరఫరా చేయు పైపులకు ఇబ్బంది లేకుండా పనులు చేపట్టాలని సిబ్బందికి కాటసాని తిరుపాల్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సురేష్, వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్లు కంబగిరి, హైదర్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్విన్ బోల్తా

కొలిమిగుండ్ల: మంగళగిరి నుంచి అనంతపురానికి పాఠ్య పుస్తకాలను తీసుకెళ్తున్న ఆల్విన్ వాహనం గురువారం కొలిమిగుండ్ల సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. వివరాలిలా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలకు అందించేందుకు పాఠ్య పుస్తకాల లోడ్‌తో ఆల్విన్ మంగళగిరి నుంచి అనంతపురంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన స్టోరేజీ పాయింట్‌కు తీసుకెళ్తున్నారు. కొలిమిగుండ్ల సమీపానికి చేరుకోగానే ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించేక్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో డ్రైవర్ రాజు స్వల్పగాయాలతో బయట పడ్డాడు. పుస్తకాలను మరో వాహనంలో అనంతపురం తరలించారు.

22న ఫంక్షన్ హాల్ నిర్మాణానికి భూమి పూజ

కొలిమిగుండ్ల: అనంతపురం-అమరావతి జాతీయ రహదారి చెంతనే కస్తూర్బా పాఠశాల ముందు భాగంలో ఫంక్షన్ హాల్ నిర్మాణానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. రామ్‌కో సిమెంట్ కంపెనీ రూ.2కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఫంక్షన్ హాల్ నిర్మించనున్నారు. ఈనెల 22న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, రామ్‌కో సిమెంట్ ప్రెసిడెంట్ రెడ్డినాగరాజు చేతుల మీదుగా భూమి పూజ చేయనున్నారు. మండల ప్రజల సౌకర్యార్థం 765/6 సర్వే నంబర్‌లో 1.60 ఎకరాల ప్రభుత్వ భూమిని ఉన్నతాధికారులు ఫంక్షన్ హాల్‌కు కేటాయించారు. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డికి ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

నేటి నుంచి రోడ్డు నిర్మాణం పనులు

డోన్ : పట్టణంలోని పాతబస్టాండ్‌లోని గాంధీ విగ్రహం నుంచి రైల్వే స్టేషన్ వరకు కి.మీ మేర రూ.2.80కోట్లతో శుక్రవారం నుంచి రోడ్డు నిర్మాణం పనులు చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. గురువారం రహదారిని ఏఈ జనార్దన్‌తో కలిసి పరిశీలించిన అనంతరం చైర్మన్ మాట్లాడారు. ఈ రోడ్డు గుండా వాహనాల రాకపోకలను మూడు రోజుల పాటు నిలిపివేసామన్నారు. రైల్వే స్టేషన వెళ్లేందుకు కోర్టు ప్రక్కన రోడ్డు, కర్నూలు రైల్వే గేట్ల ప్రక్కన రోడ్లను వాహనచోదకులు వినియోగించుకోవాలని సూచించారు.

ఆర్బీకేల్లో విత్తనాలు, ఎరువులు

డోన్ టౌన్ : ఖరీఫ్‌లో సబ్ డివిజన్ పరిధిలో రైతులు 65వేల హెక్టార్ల సాగు భూమిలో వ్యవసాయ, ఉద్యాన పంటలు ప్రధానంగా సాగు చేస్తారని వ్యవసాయశాఖ ఏడీ అశోక్‌వర్ధన్ రెడ్డి గురువారం తెలిపారు. ఈ మేరకు వేరుశనగ, కొర్ర, కందులు, ఉల్లి, టమోటా, మిరప, ఆముదం తదితర నాణ్యమైన విత్తనాలు రైతుభరోసా కేంద్రాల్లో ఉంచామన్నారు. అదేవిధంగా యూరియా, డీఏపీ ఎరువులు సిద్ధం చేసామన్నారు. వ్యాపారుల నుంచి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో ఖచ్చితంగా బిల్లులు తీసుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

రూ.400 కోట్లతో అవుకు టన్నెలు-3 నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం



గ్రామ గ్రామాన సచివాలయాలు



జీఎన్ఎస్ఎస్ కాల్వకు రూ.800 కోట్లతో లైనింగ్ పనులు పూర్తి



ఎన్జీఓ కాలనీలో నిర్మిస్తున్న ఓహెచ్ఆర్ ట్యాంక్



అభివృద్ధి పరుగులు!

- బనగానపల్లె నియోజకవర్గంలో మౌలిక వసుతుల కల్పనకు రూ.2,549 కోట్లు
- సంక్షేమ పథకాలతో 4.32లక్షల మందికి చేకూరిన లబ్ధి రూ.994 కోట్లు
- ప్రజా సంక్షేమ, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- టీడీపీ పాలనలో హామీలతోనే సరి.. అన్నీ అసంపూర్ణమే ?



నిర్మాణం పూర్తికావచ్చిన వంద పడకల బనగానపల్లె ఏరియా ఆసుపత్రి

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజాసంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తుంది. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ‘నవరత్నాలు పథకాలు’ పథకాలు ప్రవేశపెట్టారు. పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ప్రజల వద్దకే పాలన సాగిస్తున్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా మౌలిక వసతులు కల్పించడంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది కూడా. అమ్మఒడి, విద్యా, వసత దీవెనలు అందజేస్తూ ఏ తల్లి ఆర్థికంగా ఇబ్బంది పడకుండా అండగా నిలుస్తుంది ప్రభుత్వం. అదేవిధంగా ఆరోగ్యశ్రీ పథకం పరిధిని పెంచడంతోపాటు విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటుతో పల్లెల ప్రజలకు నేరుగా వైద్య సేవలు అందుతున్నాయి. ప్రత్యేకించి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అందరి మన్ననలు పొందుతుంది. సచివాలయాలకు అనుబంధంగా రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులకు నేరుగా సేవలు అందుతున్నాయి. పెట్టుబడి సాయం అందజేయడంతోపాటు మద్దతు ధర కల్పిస్తూ దిగుబడులు అమ్ముకునేంత వరకు రైతన్నకు అండగా నిలుస్తుంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో బనగానపల్లె నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో మౌలికవసుతుల కల్పనకు రూ.2,549 కోట్లు, సంక్షేమ పథకాలతో రూ. 4.32లక్షల మందికి చేకూరిన లబ్ధి రూ.994 కోట్లు చేకూరింది. సచివాలయ, రైతుభరోసా, హెల్త్‌క్లినిక్ కేంద్రాలతో పల్లెలకు పట్టణ శోభ సంతరించుకుంది. ఏళ్లతరడి కనీసం మరమ్మతులకు నోచుకోని రోడ్లు నేడు కళకళలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో లోకేష్ యువగళం యాత్ర బనగానపల్లె మండల టంగుటూరు నుంచి శుక్రవారం ప్రారంభం కానుంది. దీంతో గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన వ్యత్యాసాలను ప్రజలు చర్చించుకుంటున్నారు.

టీడీపీ పాలనలో అన్నీ అసంపూర్తే....

- చంద్రబాబు పాలనలో బనగానపల్లె మార్కెట్ యార్డులో 2017లో ఒక్కొక్కటి 1500ల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన రెండు గిడ్డంగుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.50 కోట్లు మంజూరు చేసింది. కొంతమేర పనులు చేపట్టగా నిధుల సమస్యతో నేటికి అసంపూర్తిగానే నిలిచి పోయింది.
- బనగానపల్లె పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తాం అంటూ రింగ్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుకాగా 2019 ప్రారంభంలో అప్పటి ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి హడావిడిగా శంకుస్థాపన చేశారు. అయితే నిర్మాణ పనులు ఏమాత్రం ముందుకు సాగలేదు.
- నీరు - చెట్టు పథకం ద్వారా చెరువుల అభివృద్ధి, చెక్కు డ్యామ్‌ల నిర్మాణం, వాగులు, వంకల్లో ముళ్లకంప తొలగింపు, పంట పొలాలకు రహదారుల అంటూ చేసిందేమీ లేదు. ఈ పనులకు 150 కోట్ల నిధులు మంజూరుకాగా ఎక్కడా అభివృద్ధి పనులు జరగలేదు. ఈ నిధులు దుర్వినియోగంపై విమర్శలు వెల్లువెత్తాయి కూడా.
- ఒక్క ఇంటి పట్టా పంపిణీ చేసిందీ లేదు.

అడ్డంకులు సృష్టిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ...

ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బనగానపల్లె నియోజవకర్గ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తుంటే... టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నీ అడ్డంకుటు సృష్టిస్తున్నారని ప్రజలు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రత్యేకించి బనగానపల్లె పట్టణంలో పెద్దఎత్తున పేదలకు ఇంటి పట్టాల పంపిణీకి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సిద్ధం కాగా మాజీ ఎమ్మెల్యే బీసీ తన ప్రతినిధుల ద్వారా కోర్టుకు వెళ్లి అడ్డుకున్న విషయం అందరికీ తెలిసిందే. బీసీ తీరుపై పట్టణ ముస్లింలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే కాటసాని పేదలకు భూ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోగా... మళ్లీ బీసీ జనార్దన్‌రెడ్డి అడ్డుపుల్ల వేశారు. కొలిమిగుండ్లలో భూ పంపిణీ జరగకుండా బీసీ కోర్టుకెళ్లి అడ్డుకున్న విషయం అందరికీ తెలిసిందే.

నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు కొన్ని..

- బనగానపల్లెలో రూ.22 కోట్లతో చేపట్టిన వంద పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణం చురుగ్గా సాగుతుంది. త్వరలో ప్రారంభోత్సవానికి ముస్తాబవుతుంది. ఈ ఆసుపత్రి జిల్లా ఆసుపత్రిగా ఏర్పాటు అవుతున్నట్లు వైద్యాధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే వైద్య, సిబ్బంది నియామకం జరగడంతో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుతున్నాయి.
- బనగానపల్లెలో మాసుంబాషా దర్గా శ్మశానవాటిక కాంపౌండ్‌వాల్ నిర్మాణాన్ని రూ.69లక్షల మంజూరయ్యాయి. నిర్మాణ పనులు చురుగ్గాకొనసాగుతున్నాయి. తపాలశాఖ కార్యాలయం ప్రక్క భాగంలోని శ్మశానవాటిక కాంపౌండ్‌వాల్, నిర్మాణంతో పాటు ఇంకా ఇక్కడ మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది. పట్టణంలోని అవుకు మెట్టసమీపంలో ఇబాదత్‌ఖానాను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సుమారు రూ.35లక్షల సొంత నిధులతో నిర్మాణ పనులు చేపట్టారు.
- ఆర్యవైశ్యబ్రాహ్మణ సంఘం శ్మశానవాటికకు రూ.10లక్షలు నిధులు కేటాయించి నిర్మాణ పనులు చేపట్టారు.
- బనగానపల్లె పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రూ.8 కోట్లు, కోవెలకుంట్ల పట్టణంలో రూ.4 కోట్లతో పోర్‌లైన్స్ నిర్మాణ పనులు చురుగ్గాసాగుతున్నాయి.
- జీఎన్ఎస్ఎస్ లైనింగ్, అవుకు టన్నెలు-3 నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం రూ.1,259 కోట్ల నిధులు మంజూరుకాగ లైనింగ్ పనులు 95శాతం పూర్తయ్యాయి. టన్నెలు నిర్మాణ పనులు యుద్ధప్రతిపాదికంగా జరుగుతున్నాయి.
- జిల్లాలో ఎక్కడలేనివిధంగా జల్‌జీవన్ పథకం ద్వారా బనగానపల్లె నియోజవర్గానికి రూ.80 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే 70-80శాతం పనులు పూర్తికాగ చాటా గ్రామాల్లో ఇంటింటికీ కుళ్లాయి కనెక్షన్ ఇవ్వడంజరిగింది. బనగానపల్లె పట్టణంలో ఒక్కొక్కటి 2.50లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు ఓహెచ్ఆర్‌ల పనులుచురుగ్గా జరుగుతున్నాయి. ఈ నెల చివరికి పనులు పూర్తవుతాయి.
- పంచాయతీరాజ్‌శాఖ ద్వారా రూ.219 కోట్లు ఆర్అండ్‌బీ ద్వారా రూ.204 కోట్లు, అవుకు రిజర్వాయర్ నుంచి పెద్దవెంతుర్ల వరకు జీఎన్ఎస్ఎస్ కాల్వ వెడల్పు కోసం రూ.295 కోట్లు, తెల్లపూర్ నుంచి కుందూనది వెడల్పుకు రూ.200 కోట్లు, జొలదరాశీ రిజర్వాయర్ నిర్మాణానికి రూ.312 కోట్లు, మైనర్ ఇరిగేషన్‌కు రూ.3 కోట్లు, ఎన్ఆర్ఈజీఎస్ అభివృద్ధి పనుల కోసం రూ.124 కోట్లు, జలకళ పథకం ద్వారా బోర్లు వేయుటకు రూ.7.19 కోట్ల కేటాయింపు జరిగింది. నియోజకవర్గంలో 233 సీసీ రోడ్లు ఏర్పాటుకు రూ. 33.72 కోట్లు, గ్రావెల్ రోడ్లకు రూ.8.14 కోట్లు ఖర్చు చేశారు. రూ.42 కోట్లతో ఇంకా మరి కొన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

సాగునీటి సౌకర్యం

నియోజకవర్గంలో సుమారు 74వేల ఎకరాల ఆయకట్టుకు ఎస్ఆర్‌బీసీ ద్వారా ప్రతిసంవత్సరం ఖరీఫ్ రబీ రెండు పంటలు సాగునీటి సౌకర్యం లభిస్తుంది. దీంతో వరి మొక్కజొన్న మిరప ఆముదం మరిన్ని వాణిజ్య పంటలను రైతులు ఎక్కువ విస్తీర్ణంలో పండిస్తూ మంచి దిగుబడులు సాధిస్తూ గిట్టుబాటు ధర పొందుతున్నారు. జీఎన్ఎస్ఎస్ లైనింగ్ పనులు పూర్తికావస్తున్నందున మరింత సాగునీటి సౌకర్యం లభించే అవకాశం ఉంది. జోలదరాశీ రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తి అయితే పరివాహక గ్రామ ప్రాంతాల్లో తాగుసాగునీటి సమస్య ఉండదు. జిల్లాలో ఎక్కడలేనంతగా నియోజకవర్గంలో 25వేల వ్యవసాయబోర్ల ద్వారా సుమారు లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీటి సౌకర్యం లభిస్తోంది.

పారిశ్రామికంగా అభివృద్ధి

జిల్లాలో ఎక్కడలే విధంగా నియోజకవర్గంలో పరిశ్రామికంగా అభివృద్ధి చెందుతుంది. జయజ్యోతి, ఎల్అండ్‌టీ, రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీలు నియోజకవర్గంలో ఉన్నందున ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. నాపరాతి మైనింగ్ పనులకు పాలీష్ ఫ్యాక్టరీలకు ఈ ప్రాంతం ప్రసిద్ధి. వీటి ద్వారా సుమారు 20వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. కొలిమిగుండ్ల మండలంలో మరో సిమెంట్ ఫ్యాక్టరీ ప్రీజం ఏర్పాటు కానుది. నందిపాడు వద్ద సుమారు రూ. 3వేల కోట్లతో విద్యుత్ స్టోరేజ్ చేసేందుకు పవర్‌గ్రిడ్‌కు అధికారులు సన్నహాలు ప్రారంభించారు.

- మొత్తం 79 గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు నేరుగా సేవలు అందుతున్నాయి.
- మొత్తం 77 ఆర్‌బీకేల ద్వారా ప్రతి రైతుకు గ్రామస్థాయిలో సబ్సిడీ విత్తనాలు, సూచనలు, ఎరువులు సస్యరక్షణ సలహాలు పంటదిగుబడుల కొనుగోల్లు సాగుతున్నాయి.
- మొత్తం 53 హెల్త్‌క్లినిక్ మంజూరు కాగా గ్రామాల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందున్నాయి.

మాయ మాటలతోనే చిన్నారుల కిడ్నాప్

- 24 గంటల్లో కేసు చేధించిన పోలీసులు
- ఆటో డ్రైవర్‌పై కిడ్నాప్, ఫోక్సో కేసు
- చిన్నారులు తల్లిదండ్రులకు అప్పగింత
- వివరాలు వెల్లడించిన సీఐ నారాయణరెడ్డి



నిందితుడిని అరెస్టు చూపిస్తున్న సీఐ నారాయణరెడ్డి

కోవెలకుంట్ల: అభం, శుభం తెలియని చిన్నారులను మాయ మాటలతో నమ్మబలికించి ఆటో డ్రైవర్ ఇమాంఉసేన్ కిడ్నాప్ చేసినట్లు కోవెలకుంట్ల సీఐ నారాయణరెడ్డి తెలిపారు. చిన్నారుల కిడ్నాప్ కథ సుఖాంతం కావడంతో గురువారం సాయంత్రం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక నాగులకట్ట వీధి సమీపంలో నివాసం ఉంటున్న షేక్ మహమ్మద్, షమీవున్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పట్టణంలో సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ నేర్చుకుంటున్నారు. ఇదే వీధికి చెందిన ఇమాంఉసేన్ ప్రతి రోజు పిల్లలను ఆటోలో పాఠశాలకు తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో పెద్ద కుమార్తెతో చనువు పెంచుకున్నాడు. 55 ఏళ్ల వయసులో కూడా 13 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పాడు. వివాహం చేసుకోవడంతోపాటు చెల్లెలును చదివించి ప్రయోజకురాలిని చేస్తానని బాలికను నమ్మించాడు. తెలిసి, తెలియని వయసులో బాలిక ఆటో డ్రైవర్ మాటలు నమ్మగా ఈ నెల 16వ తేదీన ఇద్దరు చిన్నారులను తీసుకుని నంద్యాల నుంచి రైలులో ఒరిస్సాకు వెళ్లేందుకు బయలు దేరాడు. ఆ రోజు రాత్రి అయినా పిల్లలు ఇంటికి రాకపోవడంతో చిన్నారుల తల్లి షమీవున్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఆటో డ్రైవర్ సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా విశాఖపట్నం రైల్వే పోలీసుల సహకారంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆటో డ్రైవర్‌పై కిడ్నాప్, ఫాక్సోచట్టం కింద కేసు నమోదు చేసి చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు వివరించారు. చిన్నారుల కిడ్నాప్ కేసును చేధించిన ఎస్ఐలు వెంకటరెడ్డి, మౌలానీ, పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ

అవుకు: మండలం రామవరం గ్రామానికి చెందిన అన్నదమ్ముల మధ్య గురువారం ఘర్షణ జరగడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అన్నదమ్ములు రాజశేఖర్, జావీదుల మధ్య ఆస్తి పంపకాల్లో భాగంగా ఓ కొట్టం విషయంలో తగాదా వచ్చింది. జావీదు ఆ కొట్టానికి నిప్పు పెట్టి అంటించటంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. జావీదు అతని కుమారులు కట్టెలతో దాడి చేయడంతో రాజశేఖర్‌కు, మద్దిలేటికి, చెన్నమ్మకు రక్త గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం వెంటనే వారిని 108 అంబులెన్స్‌లో బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మద్దిలేటి ఫిర్యాదు మేరకు జావీదు, రాజు, రాంబాబులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు.

క్రిమి సంహారక మందుతాగి వ్యక్తి మృతి

అవుకు: పట్టణానికి చెందిన సుబ్బరాయుడు అనే వ్యక్తి గురువారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు సంబంధించి ఫిర్యాదు తమ దృష్టికి రాలేదని పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వృద్ధుడు మృతి..

అవుకు: మండల పరిధిలోని శింగనపల్లె గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద గురువారం ఓ వృద్ధుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆలయం వద్ద వృద్ధుడు విగతజీవిగా పడిఉండడాన్ని గమనించిన స్థానికులు ఎవరనేది ఆరా తీశారు. సంజామల మండలం బొందలదిన్నెగ్రామానికి చెందిన గోపిరెడ్డి క్రిష్టారెడ్డి(73)గా గుర్తించి కుటుంబ సభ్యులకు స మాచారం అందించారు.ఈ మేరకు వచ్చిన కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఎండల తీవ్రత మూలంగానే వృద్ధుడు మృతి చెందుంటాడని స్థానికులు అనుకుంటున్నారు.

దాడి కేసు నమోదు

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన ఓ యువకుడు ఓ యువతితో చనువుగా మాట్లాడుతున్నాడని, అదే కాలనీకి చెందిన ముగ్గురు దాడి చేసి గాయపరిచిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ శివశంకర్ నాయక్ వివరాల మేరకు సంజీవనగర్ కాలనీకి చెందిన సూర్య చంద్రుడుతో యువతితో చనువుగా మాట్లాడుతుందని, యువతి బంధువులు బాలహుస్సేనీ, హుస్సేన్ నాయుడు, సోమరాజు అనుమానం పడ్డారు. సూర్య చంద్రుడిని కొట్టి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అసభ్యకర మెసేజ్‌లు పెడితే చర్యలు

బేతంచెర్ల: రాజకీయ నాయకులు, కార్యకర్తల గురించి చెడుగా లేదా, అసభ్యకరంగా సోషల్ మీడియాలో వాట్సాప్, ఫేస్‌బుక్‌లో రాయడం, వీడియోల పోస్టులు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శివ శంకర్ నాయక్ హెచ్చరించారు. గురువారం ఆయన పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతూ నాయకులు మనోభావాలు దెబ్బతినే విధంగా మాట్లాడినా, శాంతి భద్రతలకు విఘాతం కల్గించినా చర్యలు తప్పవన్నారు. అపరిచిత వ్యక్తులు తక్కువ ధరకు సెల్‌ఫోన్లు, మోటార్ సైకిల్స్, మరే ఇతర వస్తువులు అమ్మడానికి వచ్చినా పోలీసులకు తెలియజేయాలన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా సంక్షేమ పథకాల అమలు

బేతంచెర్ల: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పేదరిక నిర్మూలనే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సీతారామాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఈఓఆర్డీ వెంకట రంగనాయకులు, సర్పంచ్ చిట్టి వేణుగోపాల్ రెడ్డి, ఎంపీటీసీ సుబ్బమ్మ, పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వర్ రెడ్డి సిబ్బందితో కలిసి ఎంపీపీ నిర్వహించారు. ఎంపీపీ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించి బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. డ్రైనేజీ కాల్వలు, సీసీ రోడ్లు, కుళాయిలు, ఇళ్లు మంజూరు చేయాలని, సామూహిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు విన్నవించారు. ప్రాధాన్యత మేరకు సమస్యలన్నీ పరిష్కరిస్తామని, ఇంటింటికీ కుళాయి ఇవ్వడమే కాకుండా గోరుకల్లు రిజర్వాయర్ ద్వారా శుద్ధమైన నీరు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ రాజశేఖర్ రెడ్డి, హౌసింగ్ ఏఈ శేఖర్ బాబు, ఎంఈఓ సోమశేఖర్, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురళీకృష్ణ, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, ఆర్వేటి శేఖరయ్య, తిరుమలేశ్వర్‌రెడ్డి, ఎద్దులన్న, మద్దిలేటి, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

పోషకాహార కిట్ల పంపిణీ

అవుకు: ఉప్పలపాడు ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న క్షయ వ్యాధిగ్రస్తులకు తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ యమునా గురువారం పోష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులలో పోషకాహార లోపా న్ని నివారించటానికి ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఉప్పలపాడు పీహెచ్‌సీ సిబ్బంది అందరమూ కలిసి 25 మంది క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకున్నామన్నారు. ఒక్కొక్కరికి ప్రతి నెల రూ.700లు విలువ చేసే కందిపప్పు, గోదుమపిండి, రాగిపిండి, వంటనూనె, బెల్లము, కోడిగుడ్లతో కూడిన ఒక కిట్టును 6నెలలు తమ సొంత నిధులతో పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ శ్రీనివాసులు ఇద్దరు వ్యాధిగ్రస్తులను, వ్యవసాయ అధికారి ఇద్దరిని, ఇతర అధికారులు మరో ఇద్దరు వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకున్నారు.

పురస్కారాలకు వలంటీర్ల

కొలిమిగుండ్ల: ఉత్తమ సేవలు అందించిన గ్రామ వలంటీర్లను ప్రభుత్వం ప్రతి ఏడాది వందనం పేరుతో పురస్కారాలు అందజేస్తుందని ఎంపీడీఓ సుబ్బరాజు గురువారం తెలిపారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో 230 మంది వలంటీర్లు ఉన్నారన్నారు. సేవా వజ్ర అవార్డుకు చింతలాయిపల్లెకు చెందిన నాగమనీష ఎంపికైందన్నారు. ఈ ఆవార్డు కింద ప్రభుత్వం రూ.30 వేలు అందిస్తుందన్నారు. అలాగే సేవా రత్న కింద గొర్విమానుపల్లె నుంచి సరస్వతి, బందార్లపల్లె నుంచి భారతి, తిమ్మనాయినపేట నుంచి చౌడయ్య, చింతలాయిపల్లె నుంచి రాజగోపాల్, తోళ్లమడుగు నుంచి షేక్ మహ్మద్‌రఫీ ఎంపికయ్యారని, వీరికి రూ.20వేలు చొప్పున అందిస్తామన్నారు. సేవా మిత్రల కింద వివిధ గ్రామాల నుంచి 224 మంది ఎంపికయ్యారని, వీరికి రూ.10వేల చొప్పున నగదు పురష్కారం అందుతుందని ఎంపీడీఓ తెలిపారు. త్వరలోనే ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చేతుల మీదుగా అవార్డుల ప్రదానం జరుగుతుందన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

బనగానపల్లెరూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో గురువారం మహా శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తొటబుచ్చిరెడ్డిల ఆధ్వర్యంలో ఉమామహేశ్వరస్వామికి అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీశివపార్వతుల కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

నియామకం



ఉర్దూ అకాడమి సభ్యుడిగా మూర్తుజావలీ



రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరక్టర్ సయ్యద్ ఖాజా హుసేన్ ఖాజా హుసేన్

బేతంచెర్ల: స్థానిక శ్రీనగర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.మూర్తుజావలీని ఉర్దూ అకాడమీ సభ్యుడిగా ఎంపికయ్యారు. అలాగే కోటపేట కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎస్. ఖాజా హుసేన్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియామకం అయ్యారు. వీరి ఎంపికపై ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోపాటు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి ఈ సందర్భంగా మూర్తుజావలీ, ఖాజా హుసేన్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా పని చేస్తామని వారు అన్నారు.

ఏపీఐసీసీ డైరెక్టర్‌గా బోరెడ్డి పుల్లారెడ్డి



ప్యాపిలి: డోన్ మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బోరెడ్డి పుల్లారెడ్డి ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికై నట్లు ఆదేశాలు వెలువడ్డాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్యాపిలి మండల సీనియర్ నాయకుడైన బోరెడ్డి పుల్లారెడ్డికి ఈ పదవి దక్కడంపై స్థానిక నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడం వల్లనే తనకు ఈ పదవి దక్కినట్లు బోరెడ్డి పుల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఉత్తమ ఫలితాలు

కోవెలకుంట్ల: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని రీజినల్ జాయింట్ డైరెక్టర్ నాగలింగారెడ్డి అన్నారు. గురువారం స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తనిఖీ చేశారు. కళాశాల రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసి నాడు- నేడు కార్యక్రమం ద్వారా కళాశాలల్లో అన్ని వసతులు కల్పిస్తోందన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, వసతులపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేశవరావు, వైస్ ప్రిన్సిపాల్ బాబునాథ్, అధ్యాపకుడు రామసుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగలింగారెడ్డి